రేపటి నుంచి మంత్రి సత్యకుమార్ జిల్లా పర్యటన

కడప, చిన్నచౌకు, మారుతీనగర్: న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. 29వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రొద్దుటూరులో జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారు. సాయంత్రం 7 గంటలకు ప్రొద్దుటూరు నగర పుర ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తారు. 30వ తేదీ ఉదయం ప్రొద్దుటూరు సర్వజన ఆసుపత్రి పర్యటన అనంతరం కడపలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆడిటోరియం, ల్యాబ్ ప్రారంభోత్సవాలుంటాయని తెలిపారు. అనంతరం కడప నగర పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

గండి లడ్డూ ప్రసాదం నాణ్యతపై పరిశీలన

నమూనాలు సేకరించిన అధికారులు

స్పందనకు వందనం

చక్రాయపేట, న్యూస్‌టుడే: ప్రముఖ గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో లడ్డూల నాణ్యతను శుక్రవారం పులివెందుల సహాయ ఆహార భద్రతాధికారిణి హరిత పరిశీలించారు. ఇక్కడ లడ్డూ ప్రసాదం నాణ్యతపై 'ఈనాడు'లో ఈ నెల 25వ తేదీన 'గండి లడ్డూలో నాణ్యతెంత?' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వీరి ఆదేశాల మేరకు ఆలయాన్ని ఆమె సందర్శించారు. లడ్డూ ప్రసాదంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు కొన్నింటిని పరీక్షల నిమిత్తం కడపకు తీసుకెళ్లినట్లు గండి ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వివరించారు. భక్తులకు అందిస్తున్న ప్రసాదాలు, అన్నదానానికి వాడే నిత్యావసర సరకుల నమూనాలను సేకరించారన్నారు. భక్తులు తాగే మంచినీటి నమూనాలను సైతం తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.



లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న పులివెందుల సహాయ ఆహార భద్రతాధికారిణి హరిత

ఈనాడు వైయస్సార్

శనివారం సెప్టెంబరు 28, 2024 5

అబ్బే... మాకేం తెలియదండి!

ఫ్రీహోల్డ్ భూములపై అధికారుల దాటవేత వైఖరి

వీరబల్లి మండలంలో దాదాపుగా సగం అక్రమాలే

మైదుకూరు ప్రాంతంలోనూ 576 ఎకరాల గుర్తింపు

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాగిన భూదందాలపై నిగ్గు తేల్చేందుకు కంకణం కట్టుకున్న ఎన్డీయే ప్రభుత్వం మొదటి అడుగుగా రాష్ట్రంలోని ఆరు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి విచారణ చేపట్టింది. దీంతో భారీఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అత్యధికంగా ఫిర్యాదులు రావడం, ఫ్రీహోల్డ్ భూములను ఎక్కువ విస్తీర్ణంలో చేయడంతో వైఎస్ఆర్ జిల్లాలో మైదుకూరు, అన్నమయ్య జిల్లాలో వీరబల్లి మండలాలను ఎంపిక చేసి సమగ్ర విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ఆరింటిలో పై రెండు మండలాలున్నాయి. మండల పరిధిలోని ఆర్డీవో, తహసీల్దారు, మండల సర్వేయర్, అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్లను కమిటీ సభ్యులుగా నియమించి కసరత్తు చేపట్టింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ దస్త్రాల ఆధారంగా శోధన చేపట్టింది. ఫ్రీహోల్డ్ భూముల ఎంపికలో నిబంధనలు పాటించారా?.. 20 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారా?.. తప్పుడు లెక్కలతో నిషేధిత జాబితా నుంచి తొలగించారా?.. ఈ భూముల రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది?.. తదితర అంశాలను విచారణలో పరిశీలించింది. ఫ్రీహోల్డ్ భూములతో పాటు చెరువులు, కాలువలు, పోరంబోకు, రస్తాలు, అటవీ భూముల ఆక్రమణలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిల్లో విక్రయ, గిఫ్ట్‌డీడ్ పత్రాలు పరిశీలించింది. ఈ కార్యక్రమం సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో జరిగింది. అసైన్డ్ పట్టాదారు భూములనే ఫ్రీహోల్డ్ చేశారా?.. ఇందులో అక్రమమేమైనా జరిగిందా?.. తదితర వివరాలు సేకరించింది. ఈ మేరకు భారీగానే అక్రమాలు వెలుగుచూశాయి.



బ్రహ్మంగారిమఠం వద్ద భూముల విషయమై రైతులతో మాట్లాడుతున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

☛ మేం ఏ తప్పు చేయలేదు. మా ప్రమేయం లేకుండా ఎవరో నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆ భూములు ఎలా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయో అర్థం కావడంలేదు. - తప్పించుకునే ఎత్తుగడలో భాగంగా బాధ్యులైన రెవెన్యూశాఖాధికారుల వాదన

☛ ఫోర్జరీ సంతకాలతో ఎవరో నిషేధిత జాబితా నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా భూములను తొలగించారు. మాకు ఏ మాత్రం సంబంధంలేదు. అవసరమైతే విచారణ చేసుకోండి. - వ్యవహారాన్ని మరింత కాలం లాగే ప్రయత్నంలో భాగంగా మరి కొందరు అధికారులు ఫోర్జరీ వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారు.



మదనపల్లె మండలం బొమ్మనచెరువులో భూములను పరిశీలిస్తున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

◆ ఫ్రీహోల్డ్ భూములు చాలా వరకు 20 ఏళ్ల అనుభవంలో లేనివాటిని తొలగింపు జాబితాలో చేర్చినట్లు తేలింది. వైకాపా నేతల అడుగుజాడల్లో పనిచేసిన పలువురు రెవెన్యూశాఖాధికారులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. అక్రమాలను నిగ్గు తేల్చిన అనంతరం బాధ్యులైన అధికారులు తప్పించుకునే ఎత్తుగడలు వేస్తున్నారు. మాటలకు... దస్త్రాలకు సంబంధం ఉండదని, పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. విచారణలో గుర్తించిన అక్రమాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. తదుపరి చర్యలు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో మదనపల్లె అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలింది.

◆ అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో 4,774 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించగా, వాటిల్లో 2.022 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా తొలగించినట్లు లెక్క తేలింది.

◆ వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో 2,788 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి భూములను తొలగించగా, అక్కడ 576 ఎకరాల వరకు అక్రమంగా తొలగించినట్లు గుర్తించారు.

◆ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 22(ఎ) జాబితా నుంచి 44 వేల ఎకరాల వరకు భూములను తొలగించినట్లు తేలగా, వీటిపై చేపట్టిన విచారణలో 22 వేల ఎకరాల వరకు అక్రమంగా జరిగినట్లు తేలింది. సగం వరకు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించారు.

◆ వీరబల్లి మండలంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 266 రిజిస్ట్రేషన్లు జరగ్గా, మైదుకూరు మండలంలో 320 జరిగాయి. వీటిలో విక్రయ, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు జరిగాయి.

◆ రిజిస్ట్రేషన్లు సైతం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరబల్లి మండలంలో 171, నిబంధనలకు విరుద్ధంగా 95 వరకు జరిగినట్లు తేలింది. మైదుకూరు మండలంలో నిబంధనల మేరకు 263 జరగ్గా, వ్యతిరేకంగా 57 వరకు జరిగినట్లు తేలింది.

అంతర్జాతీయ స్థాయిలో గండికోట అభివృద్ధి

పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాతీయస్థాయిలో గండికోట పర్యాటక కేంద్రానికి ప్రత్యేక స్థానాన్ని తీసుకొస్తామని కలెక్టర్ శివశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రంలో శుక్రవారం గండికోట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంట్రెన్స్ గేట్, గుర్రపుస్వారీ, నూతన ఎస్‌బీఐ ఏటీఎం, వాహనాల పార్కింగ్, ఆర్వో వాటర్ ప్లాంట్, కిడ్స్ ప్లే జోన్‌లను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పెన్నాలోయ సమీపంలో ఏర్పాటు చేసిన సభావేదికపై కలెక్టర్ ప్రసంగించారు. ఇక్కడ ఒబెరాయ్ సంస్థ నిర్వాహకులు అయిదు నక్షత్రాల రిసార్ట్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. హార్స్ రైడింగ్, అడ్వెంచర్ అకాడమీ అబ్బురపరిచే విన్యాసాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. రానున్నరోజుల్లో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. పర్యాటకం అంటే ఆనందంతో పాటు ఆదాయాన్నిచ్చే వనరుగా ఉండాలన్న ఉద్దేశంతో దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సహకారం అభినందనీయమని తెలిపారు.



గుర్రపు స్వారీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్

రూ.80 కోట్లు మంజూరుకు కృషి

కులమతాలకతీతంగా గండికోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గండికోట పర్యాటక అభివృద్ధితోపాటు జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా కేంద్రం నుంచి రూ.80 కోట్లు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. జమ్మలమడుగులో వచ్చే నెల ఏడో తేదీన మెగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యాక్షన్ వద్దు.. ఫ్యాషన్ ముద్దు అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పెన్నాలోయ సమీపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య తరంగిణి, సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోలాటం, విభిన్న ప్రతిభావంతుడైన కామిశెట్టి వెంకట్ నిర్వహించిన నృత్యం ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్ జానపద నృత్యగీతం, డీపీవో కార్యాలయ ఏవో ఖాదర్‌బాషా కవితలు కడుపుబ్బా నవ్వించాయి. రచయిత తవ్వా ఓబులరెడ్డి అయిదో ఎడిషన్ 'గండికోట' పుస్తకాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వేడుకల్లో జేసీ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పర్యాటకశాఖాధికారి సురేష్‌కుమార్, మేనేజరు రామ్‌కుమార్, సర్పంచి ఈశ్వర్ ఎంపీటీసీసభ్యురాలు పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భరతమాత వేషధారణలో నృత్యకారిణి అభినయం



ప్రొద్దుటూరు నృత్య తరంగిణి కళాకారుల ప్రదర్శన

'సొంత నియోజకవర్గానికే నీళ్లివ్వలేని అసమర్థుడు జగన్'

ఈనాడు డిజిటల్, అమరావతి : అధికారంలో ఉన్న అయిదేళ్లు తన సొంత నియోజకవర్గానికి కూడా నీళ్లివ్వలేని అసమర్థుడు మాజీ సీఎం జగన్ అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్వీర్యమయ్యాయని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్వహణ చేతకాక శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణను కేంద్రానికి అప్పగించారని మండిపడ్డారు.

గండికోటకు కృష్ణాజలాల నిలిపివేత

కొండాపురం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు వస్తున్న కృష్ణాజలాలను ప్రస్తుతం నిలుపుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు శుక్రవారం తెలిపారు. దీంతో అవుకు జలాశయం నుంచి సుమారు 57 కిలోమీటర్లు దూరం నుంచి వస్తున్న కృష్ణా జలాల ప్రవాహం క్రమంగా తగ్గిందన్నారు. గండికోట జలాశయంలో 26 టీఎంసీల నీరు నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 25.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. మైలవరం జలాశయానికి ప్రస్తుతం 2500 క్యూసెక్కుల నీటిని పంపుతున్నామని క్రమంగా నీటి తరలింపు తగ్గిస్తామన్నారు.

పెన్నా ఉద్ధృతితో నిలిచిన రాకపోకలు



పెన్నా నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో చాపాడు-కమలాపురం మీదుగా శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. గంగవరం వద్ద లోలెవెల్ వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, చాపాడు, కమలాపురం

పేదింట బిల్లుల భాగ్యం!

జిల్లాలో 19,520 మంది లబ్ధిదారుల గుర్తింపు

2014-19 వరకు బకాయిలు రూ.29.78 కోట్లు

త్వరలో విడుదలకు ఎన్డీయే కూటమి నిర్ణయం

– న్యూస్‌టుడే, కడప, జిల్లా సచివాలయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు, బిల్లుల బకాయిలు (రూ.లలో)

నియోజకవర్గం	లబ్ధిదారులు	బకాయిలు
ప్రొద్దుటూరు	1,334	2,55,66,498
పులివెందుల	3,238	4,21,47,939
మైదుకూరు	2,780	4,90,14,813
కమలాపురం	2,960	5,30,19,116
బద్వేలు	3,189	4,98,55,285
జమ్మలమడుగు	5,149	2,55,66,498

పేదల సొంతింటి కలను నిజం చేయాలని గత తెదేపా ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహయోగం కల్పించాలని సంకల్పించింది. బడుగు జీవుల ఆశల సౌధం నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఇక గూడు వెతలు తీరుతాయని ఆశించారు. చాలామంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వైకాపా అధికారంలోకి వచ్చింది. అప్రజాస్వామికంగా కక్షపూరిత పాలనకు తెరలేపింది. పేదలు నిర్మించుకునే ఇళ్లకు బిల్లుల చెల్లింపులను నిలిపేసింది. అయిదేళ్ల పాటు కళ్లుకాయలు కాసేలా లబ్ధిదారులు ఎదురుచూసినా నిరాశే మిగిలింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం జగన్ జమానాలో నిర్లక్ష్యానికి గురైన రంగాలకు జీవం పోసి జవసత్వాలు నింపాలని కీలక నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

◆ జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-2019 వరకు గ్రామీణ పేదలకు మంజూరైన పక్కాగృహాల బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపివేసింది. ఐఏవై, పీఎంఏవై గ్రామీణ, రూరల్ హౌసింగ్, జీవో-171, స్పిల్‌ఓవర్‌లో ఇల్లు నిర్మించుకున్న 19,520 మందికి మొత్తం రూ.204.01 కోట్లు ఇవ్వాలి. అప్పటి తెదేపా ప్రభుత్వ పాలకులు రూ.174.23 కోట్లు చెల్లించారు. మరో రూ.29.78 కోట్లు బకాయిలున్నాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన అనంతరం అపరిష్కృతంగా ఉన్న బిల్లులు చెల్లించకుండా పక్కన పెట్టేసింది. గృహ నిర్మాణశాఖ కార్యాలయాల చుట్టూ పేదలు, బడుగుజీవులు పలు మార్లు తిరిగినా జగన్ ప్రభుత్వం కరుణించలేదు. ఇంకా మొదలుకాని 2,383 ఇళ్లు, గుంతల దశలో 45, పునాది దశలో 2,239, కిటికీల వరకు 27, గోడల వరకు 837, పైకప్పు వేసినవి 9,626, పూర్తయిన 4,363 ఇళ్లు ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. ఎన్డీయే ప్రభుత్వం చొరవ తీసుకొని 2014-19 మధ్య నిలిచిపోయిన బిల్లులు ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకోవడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో యాప్‌లో నమోదు చేయాలని ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే 5,460 మంది ఇళ్లను తనిఖీ చేసి 5,413 మందికి అర్హత ఉందని తేల్చారు. వీరికి రూ.2.31 కోట్లు చెల్లించాలని గుర్తించారు. గుంతలు, పునాది దశలో ఉన్న గృహాలను పీఎంఏవై-2లో అనుమతిచ్చి పూర్తి చేయించాలని నిర్ణయించారు.



నిర్మాణం నిలిచిపోయిన పక్కాగృహాన్ని చూపుతున్న లబ్ధిదారు ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లెకు చెందిన వెంకటసుబ్బమ్మ. ఐడీ సంఖ్య 11442902ఎన్‌హెచ్1122521. ఈమెకు 2018-19లో తెదేపా ప్రభుత్వ హయాంలో పక్కాగృహం నిర్మాణానికి అనుమతిచ్చారు. గోడల వరకు నిర్మించారు. ఈమెకు రూ.68,325 బిల్లు మంజూరవ్వగా, రూ.43,550 మాత్రమే జమ చేశారు. మరో రూ.24,775 బిల్లు ఇవ్వాల్సి ఉన్నా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వలేదు. ఎన్డీయే ప్రభుత్వం బిల్లుల చెల్లింపులకు నిర్ణయం తీసుకోవడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఇంటిని చూపుతున్న లబ్ధిదారు ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లికి చెందిన లబ్ధిదారు రమణమ్మ. ఈమెకు 2018-19లో ఎన్టీఆర్ గృహపథకం కింద ఇల్లు మంజూరు చేశారు. ఐడీ సంఖ్య 112442905 ఎన్‌హెచ్1122461. పనులు చేసిన వరకు రూ.1,07,125 బిల్లులు మంజూరు కాగా, లబ్ధిదారు ఖాతాకు రూ.82,350 జమ చేశారు. మరో రూ.24,775 చెల్లించాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులివ్వలేదు. పైకప్పు వేసిన అనంతరం డబ్బుల్లేక నిర్మాణపనులు నిలిపేశారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆమె హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2014-19 వరకు పక్కాగృహాలు మంజూరై బిల్లులు రాని లబ్ధిదారులున్నట్లు గుర్తించాం. క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. మంజూరైన ఇల్లు ఏ దశలో ఉందని సమాచారం సేకరిస్తున్నాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే అందరికీ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం. **- కృష్ణయ్య, పీడీ, గృహనిర్మాణశాఖ**

వెలిగల్లులో తగ్గిన నీటి మట్టం

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయంలో శుక్రవారం 2.31 టీఎంసీల నీటి నిల్వలున్నాయని డీఈఈ బి.శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ఈ ఏడాది నీటి నిల్వలు పెరగలేదు. రాయచోటి, గాలివీడులోని తాగునీటి పథకాలకు అరు క్యూసెక్కులు, ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిస్తే పాపఘ్ని నదీ నీటి ప్రవాహంతోనే జలాశయంలో నీటిమట్టం పెరుగుతుందని, ఉన్న నీటినే సద్వినియోగం చేసుకోవాలని డీఈఈ తెలిపారు.

రబీకి సమాయత్తం!

☛ 1.42 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణం

☛ 77,100 టన్నుల ఎరువులకు ఇండెంట్

– న్యూస్‌టుడే, కడప వ్యవసాయం

జిల్లాలో రబీ పంటల సాగుకు వ్యవసాయశాఖ సమాయత్తమవుతోంది. జిల్లాకు సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తూ రాష్ట్ర గణాంక విభాగం జిల్లా అధికారులకు వివరాలు పంపింది. గత అయిదేళ్లుగా సాగైన పంటల వివరాలు తీసుకుని 2024-25 రబీలో సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తూ జిల్లాకు నివేదిక పంపారు. దీన్ని ఆధారంగా చేసుకుని జిల్లా వ్యవసాయశాఖ ఎరువులు ఎంత అవసరమనేది రాష్ట్ర ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 2024-25 రబీ కింద 1,42,812 హెక్టార్ల సాధారణ విస్తీర్ణాన్ని నిర్ణయిస్తూ రాష్ట్ర గణాంకశాఖ జిల్లాకు పంపింది. అన్ని రకాల పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. గతేడాది సాధారణ సాగు విస్తీర్ణం 1,48,820 హెక్టార్లు కాగా, ప్రస్తుతం 6,008 హెక్టార్లు తగ్గింది. మొత్తం ముతక ధాన్య పంటలు 12,201 హెక్టార్లు, పప్పుధాన్యాలు 1,00,838 హెక్టార్లు, నూనెగింజల పంటలు 15,810, పొగాకు 59, పత్తి 2626 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం చేశారు.

77,100 టన్నుల ఎరువులు : రబీలో సాగుచేసే పంటలకు అన్ని రకాల ఎరువులు కలుపుకొని 77,100 టన్నులు అవసరమని జిల్లా వ్యవసాయశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టింది. అక్టోబరు నుంచి మార్చి వరకు పంట కాలానికి ఎరువులు అవసరమని పేర్కొంది. ఆరునెలలకు గాను నెలవారీగా ఏ ఎరువు ఎంత అవసరమనేది నివేదిక పంపించింది.

75,597 క్వింటాళ్ల విత్తనాలు: రబీ పంటల సాగుకు అవసరమయ్యే ప్రధాన విత్తనాలను ఎంత కావాలనేది నివేదిక పంపారు. మినుము 976 క్వింటాళ్లు, పెసర 328, కంది 15.5, బుడ్డసెనగ 72,386, వేరుసెనగ (కె-6) 1,800, నువ్వులు 70, కొర్ర 18, రాగి 4 క్వింటాళ్లు కావాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. మొత్తం 75,597.5 క్వింటాళ్లు అవసరం కానున్నాయి.

సిద్ధం చేస్తున్నాం: రబీ పంటల సాగుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎరువులు, విత్తనాలు ఎంత అవసరమనేది నివేదిక పంపించాం. క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో పంటల సాగుకు సిద్ధంగా ఉన్నాం. **- నాగేశ్వరరావు, డీఏవో**



సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న ఇందిరాప్రియదర్శిని

కడప యువతికి పురస్కారం

విజయవాడ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్టేట్ టూరిజం అవార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా శుక్రవారం అందించారు. కడప నగరానికి చెందిన గుండ్రాతి ఇందిరా ప్రియదర్శినికి ఏపీ టూరిజం బెస్ట్ బ్లాగర్/ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ పురస్కారం దక్కింది.

డీటీసీ బాధ్యతల స్వీకరణ



కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా ఎ.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మీరాప్రసాద్‌ను విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, శ్రీకాకుళంలో డీటీసీగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి కడపకు వచ్చారు. వాహనదారులకు అందుబాటులో ఉంటానని సమస్యలుంటే తనను సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవ్‌కు జిల్లా విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే : గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమానికి శుక్రవారం రాత్రి జిల్లా నుంచి విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. కడప కేంద్రీయ విద్యాలయం నుంచి ఎంపికైన గంగసుబ్బగారి ఇంద్రనీల్, చెమ్ముమియాపేట జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి కర్నాటి భ్రమరాంబిక, జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వారితో పాటు ప్రధానోపాధ్యాయిని మేరి, తదితరులు విద్యార్థుల వెంట వెళ్లారు.

రూ. కోట్ల ప్రజాధనం... నిరుపయోగం

- జగనన్న కాలనీల్లో విద్యుత్తు పనుల ఖర్చు రూ.77.68 కోట్లు
- శివారు ప్రాంతాల్లో అభద్రత నడుమ సామగ్రి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల్లో కరెంటు సరఫరా పనులకు వ్యయం చేసిన రూ.77.68 కోట్ల నిధులు వృథాగా మారాయి. ఈ దుస్థితి ఉమ్మడి కడప జిల్లాల పరిధిలోని నగర కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. పాలకులు, ఉన్నతాధికారుల నుంచి ఎస్పీడీసీఎల్‌కు వచ్చిన ఒత్తిళ్ల దృష్ట్యా అప్పట్లో కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ అధికారులు హడావుడిగా ఏర్పాటుచేసిన స్తంభాలు, తీగలు, నియంత్రికలు అలంకారప్రాయంగా మారాయి. కాలనీలు నివాసయోగ్యంగా లేవు.

మౌలిక సౌకర్యాల లేని కారణంగా లబ్ధిదారు సొంతింట్లో చేరేందుకు విముఖత చూపుతున్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు సామగ్రిలో స్తంభాలు మినహా తీగలు, నియంత్రికలు చివరకు చోరీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలోని రాయచోటి, రాజంపేట, పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, డివిజన్ల వారీగా మొత్తం 689 చోట్ల లేవుట్లు ఉండగా రూ.77.68 కోట్ల వ్యయంతో మొత్తం 1,16,699 ప్లాట్లకు కరెంటు సరఫరా అందజేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ గత నాలుగేళ్ల వ్యవధిలో 575 చోట్ల మాత్రమే విద్యుత్తు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆరు డివిజన్లలోని 114 లేఅవుట్లలోని 3,785 ప్లాట్లకు కరెంటు సరఫరా కల్పనలో జాప్యం జరుగుతోంది. కరెంటు సౌకర్యమున్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నియంత్రికలు, స్తంభాలు, తీగలు..దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. నల్లరేగడి భూముల్లో ఏర్పాటు చేసిన స్తంభాలు ఒరిగిపోతున్నాయి.


బొల్లవరం జగనన్న కాలనీలో దిమ్మెలపై అలంకారప్రాయంగా ఉన్న నియంత్రికలు

డివిజన్లవారీగా ప్రొద్దుటూరులో 2,217 ఇళ్లకు కరెంటు మీటర్లిచ్చారు. కడపలో 3,114, పులివెందులలో 1,537, రాజంపేటలో 1,429, రాయచోటిలో 1,412 వాటికి ఇచ్చారు.

డివిజను	మొత్తం లే-అవుట్లు	మొత్తం ప్లాట్లు	జగనన్న కాలనీలకు వెలుగులు	లబ్ధిదారుల ప్లాట్లకు కరెంటు సరఫరా
రాజంపేట	164	13,619	132	12,576
రాయచోటి	117	12,294	94	11,799
కడప	41	27,078	36	26,873
పులివెందుల	97	14,274	77	13,318
ప్రొద్దుటూరు	136	33,768	116	33,161
మైదుకూరు	134	15,666	120	15,187

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాం

ఆరు డివిజన్లవారీగా జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు జరగుతున్న చోట్ల మాత్రమే వెలుగులను అందజేసేందుకు సౌకర్యాలను కల్పించాం. కట్టడాలు లేని చోట్ల కరెంటు ఏర్పాటు పనులను చేపట్టలేదు. లబ్ధిదారుల ప్రయోజనాల దృష్ట్యా అప్పట్లో ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్తు సరఫరా కోసం చర్యలు తీసుకున్నాం.
-రమణ, ఎస్ఈ, ఎస్పీడీఈసీఎల్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

'సీమ' విద్యావంతుల రాష్ట్ర మహాసభలు రేపు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర మహాసభలను ఆదివారం 29న ఉదయం 10 గంటలకు పురపాలక ఉన్నత పాఠశాలలోని స్త్రీశక్తి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సభ రాష్ట్ర కో కన్వీనర్ మహమూద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎన్జీవో హోంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలో వక్తలుగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, అనంత హక్కుల ఉద్యమకారుడు రామాంజనేయులు, రచయిత అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, వామపక్ష పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భారత్ కిసాన్ సంఘ్ ప్రతినిధి వెంకటరెడ్డి, ఎన్జీవోల సంఘ పట్టణాధ్యక్షుడు రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, పౌరహక్కుల సంఘం నాయకుడు సురేష్‌బాబు, జేవీవీ ప్రతినిధులు సురేష్, రాజేష్, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీల అభివృద్ధికి కృషి

వేంపల్లె,న్యూస్‌టుడే : ట్రిపుల్‌ఐటీల అభివృద్ధికి కృషిచేస్తామని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం సాయంత్రం ఆయన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి వచ్చారు. ఈ సందర్భంగా ఏవో రవికుమార్, క్యాంపస్ ఇంఛార్జి బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోషియేషన్ అధ్యక్షుడు నజీర్‌హుసేన్ నేతృత్వంలో రిజిస్ట్రార్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.


రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న ట్రిపుల్‌ఐటీ ఏవో రవికుమార్, ఉద్యోగులు

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి

వేంపల్లె : ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవని కడప ఫుడ్‌సేఫ్టీ అధికారిణి హరిత పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని తనిఖీ చేశారు. ఎనిమిది మెస్‌లను తనిఖీచేశారు. డైరెక్టర్ ఆచార్య కుమారస్వామిగుప్త, ఏవో పెనుగొండ రవికుమార్, విద్యార్థుల సంక్షేమాధికారి వెంకటేశు, మెస్ కో-ఆర్డినేటర్ రాము, ట్రిపుల్‌ఐటీ భద్రతాధికారి శరవణ్‌కుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండు

తుళ్లూరు, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో కడప సెంట్రల్ జైల్లో వార్డెన్‌గా పనిచేస్తున్న కె.మహేష్‌కు మంగళగిరి కోర్టు శుక్రవారం 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఎస్. భువనేశ్వరి రాష్ట్ర హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు కె.మహేష్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. గుంటూరు జిల్లా రాయపూడిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న మనస్పర్థల నేపథ్యంలో అత్త సాయికూమారిపై మహేష్ దాడి చేశాడు. ఈ ఘటనపై ఆమె కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు మహేష్‌ను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

టపాసుల లారీ పట్టివేత

చిన్నమండెం, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి టపాసుల లోడుతో ప్రొద్దుటూరు వెళ్తున్న లారీని తహసీల్దారు నరసింహులు చిన్నమండెంలో పట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిన్నమండెం మీదుగా వెళుతున్న వాహనాన్ని అధికారులు గుర్తించి సోదాలు చేశారు. సక్రమంగా రికార్డులు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో లారీని జప్తు చేశారు. అందులో రూ.3.20 లక్షల విలువైన టపాసులున్నట్లు ఆయన వివరించారు. పోలీసులకు వాహనాన్ని అప్పజెప్పినట్లు తహసీల్దారు వివరించారు.

దేవర సినిమా చూస్తూ గుండెపోటుతో అభిమాని మృతి



కడప, నేరవార్తలు, చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : ప్రముఖ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా చూస్తూ ఓ అభిమాని గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన కడప నగరంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సీకేదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన మస్తాన్‌వల్లీ (33) ఆటోడ్రైవరుగా జీవనం సాగిస్తున్నారు. ఎన్టీఆర్ అభిమాని మస్తానవల్లీ కడప నగరంలోని ఓ సినిమా థియేటర్‌లో సినిమా చూస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే పక్కనున్నవారు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న మస్తాన్‌వల్లీ మృతితో కుటుంబం వీధిన పడింది. మృతుని కుటుంబాన్ని జూనియర్ ఎన్టీఆర్ ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విష జ్వరంతో యువతి మృతి



రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన **కొటా సువర్ణ** (27) శుక్రవారం విష జ్వరంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వెల్లాల విద్యుత్తు ఉపకేంద్రంలో పనిచేస్తున్న డి.నరసింహారెడ్డి, రాజుపాళెం మండలంల అర్కటవేముల గ్రామానికి చెందిన కొటా సువర్ణ దంపతులు. 15 ఏళ్లుగా ప్రొద్దుటూరు పట్టణంలోని గాయత్రినగర్‌లో ఉంటున్నారు. వీరికి ఆరేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. సువర్ణకు విష జ్వరం కారణంగా నాలుగు రోజుల కిందట ప్రొద్దుటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఈమె శుక్రవారం మృతిచెందారు. ఈ విషయమై రాజుపాళెంలోని పీహెచ్‌సీ సూపర్వైజర్ లక్ష్మీనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆమె కర్నూలులో మృతిచెందారని, ఆమెకు మృతికి కారణం తెలిపే ధ్రువపత్రాలు పరిశీలించలేదన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు ఏఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పలు హోటళ్లపై అధికారులు దాడులు నిర్వహించారు. కడప శివారులోని పునీత బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీ చేయగా అక్కడ అపరిశుభ్రంగా ఉండడంతో రూ.40వేలు జరిమానా విధించారు. అలానే జీఎస్టీ పత్రం ఏర్పాటు చేయకపోవడంతో రూ.50 వేలు, తూనికల కొలతల శాఖ వారి స్టాంపింగ్ లేకపోవడంతో రూ.8వేలు జరిమానా విధించారు. అలానే సితార ఫ్యామిలీ రెస్టారెంట్‌పై దాడులు చేసి సరైన నూనె వాడకపోవడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.20వేలు జరిమానా విధించారు. హోటళ్ల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఇదురుబాషా, బాలగంగాధర్‌రెడ్డి, మురళీకృష్ణ, బాబు, షంషీర్‌ఖాన్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ 29న

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఈ నెల 29న కడప నగర శివారులోని అలంఖాన్‌పల్లె విస్డమ్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు వివరాలకు 83412 55151 చరవాణి ద్వారా సంప్రదించాలన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం తగదు

వేంపల్లె, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలులో జాప్యం తగదని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా పేర్కొన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎస్టీయూ రీజియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు దాటినా ఉపాధ్యాయుల ఆర్థిక, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. కొత్త పీఆర్సీ అమలుల్లోకి వచ్చే వరకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : పులివెందుల పట్టణంలో ఆగస్టు 13న ప్రభుత్వ మద్యంషాపులో జరిగిన చోరీకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు సురేష్‌కుమార్‌ను అరెస్టు చేసి అతని నుంచి రూ.2లక్షలు నగదు స్వాధీనం చేశామని పులివెందుల డీఎస్పీ మురళి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన సురేష్‌కుమార్, అలెగ్జాండర్‌లు ఇక్కడి కదిరిరోడ్డులో ఉన్న మద్యం దుకాణంలోకి వెళ్లి లాకర్‌ను పగలుగొట్టి అందులో ఉన్న రూ.4.20లక్షల నగదును దోచుకెళ్లారు. ఈ విషయమై సీఐ గంగనాథబాబు ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం అన్నికోణాల్లో విచారించి కేసును ఛేదించారని తెలిపారు. సురేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నామని అలెగ్జాండర్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సీఐ హాజీవలి, ఎస్సై నారాయణను ఎస్పీ అభినందించారని డీఎస్పీ పేర్కొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఏటీఎం చోరీ ఘటనలో హరియాణా గ్యాంగ్?

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : ఈ నెల 22న కడప, ఒంటిమిట్టల్లో జరిగిన ఏటీఎం చోరీలు జిల్లా వ్యాప్తంగా కలకలం రేపాయి. రెండు ఏటీఎంలో కలిపి రూ.43 లక్షలు దొంగలించారు. ఈ కేసును ఛేదించేందుకు జిల్లా నుంచి పది ప్రత్యేక బృందాలు హరియాణా, తమిళనాడు, బిహార్, కేరళ, తెలంగాణ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కేరళలో ఓ ముఠా ఏటీఎం చోరీకి పాల్పడి పారిపోతుండగా అక్కడ పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారు, కడప ఏటీఎం దొంగలు ఇద్దరూ ఒక్కరేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వారు వినియోగించిన కారు, కడపలోనూ ఉపయోగించినట్లు సమాచారం. ఇది హరియాణా గ్యాంగ్ పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరు కారులో వెళ్లి ఏటీఎం చోరీలకు పాల్పడిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా కారును కంటైనర్‌లోకి ఎక్కిస్తారు. ఇలా వారు తెలివిగా తప్పించుకుంటున్నారు. కడప, ఒంటిమిట్ట ఏటీఎం చోరీపై కడప పోలీసులు కేరళకు వెళ్లి విచారిస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు దుర్మరణం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడు (దాదాపు 25) రైలు కిందపడి మృతి చెందినట్లు శుక్రవారం రైల్వే పోలీసులు తెలిపారు. యువకుడు నల్ల గీతల చొక్కా, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు వివరించారు. అతని వద్ద చెన్నై నుంచి ఎర్రగుంట్లకు రైల్వే టిక్కెట్ ఉన్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి ...

ఖాజీపేట, న్యూస్‌టుడే: పత్తూరు బైపాస్ వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొని కూనవారిపల్లెకు చెందిన కల్లూరి వెంకటసుబ్బయ్య (68) అనే వ్యక్తి మృతి చెందారు. ఈయన ఖాజీపేట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా పత్తూరు బైపాస్‌పై ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని వెంకటసుబ్బయ్యను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు రిమ్స్‌కు తరలించారు.

హత్య కేసులో 12 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

మైదుకూరు, న్యూస్‌టుడే : ఆధిపత్యం కోసం మైదుకూరు పురపాలక సర్వాయపల్లెలో 16 ఏళ్ల కిందట జరిగిన బీచు పుల్లారెడ్డి హత్య కేసుకు సంబంధించి శుక్రవారం ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టు 12 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.4.70 లక్షలు జరిమానా విధించింది. ఈమేరకు న్యాయమూర్తి జి.ఎస్.రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు.. అంగన్‌వాడీ కేంద్రం, సిమెంట్ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు పనులు గ్రామానికి చెందిన నల్లపురెడ్డిగారి వెంకటరామిరెడ్డి, హతుడైన పుల్లారెడ్డి వర్గానికి వచ్చాయని తెలిసి గ్రామానికే చెందిన ఎంజే సుబ్బరామిరెడ్డి ప్రోద్బలంతో ములపాక పిచ్చిరెడ్డి వర్గీయులు రాడ్లు, వేటకొడవళ్లు కట్టెలతో దాడి చేశారు. ఈ సంఘటనలో పుల్లారెడ్డితోపాటు బాలనాగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డిలకు రక్తగాయాలు కాగా చికిత్స పొందుతూ పుల్లారెడ్డి మృతి చెందారు. 2008లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి నల్లపురెడ్డిగారి వెంకటరామిరెడ్డి ఫిర్యాదుతో ములపాక పిచ్చిరెడ్డితోపాటు మరో 21 మందిపై అప్పట్లో సీఐ బాలస్వామిరెడ్డి కేసు నమోదు చేశారు. కేసు విచారణ సమయంలో 9 మంది మృతి చెందారు. ములపాక పిచ్చిరెడ్డి, జంగంరెడ్డి నడిపి సుబ్బారెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి ఓబులరెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి లక్ష్మీరెడ్డి, జంగంరెడ్డి వీరారెడ్డి, జంగంరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగంరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, తవ్వా మునీంద్రారెడ్డి, ములపాలక సువిగారి సుబ్బారెడ్డి, జంగంరెడ్డి రామసుబ్బారెడ్డి, జంగంరెడ్డి వెంకటసుబ్బారెడ్డిలకు యావజ్జీవ కారాగాశిక్షతోపాటు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. తవ్వా ఎర్రయ్యగారి పెద్ద ఓబులరెడ్డిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నట్లు వెల్లడించారు. కేసును పర్యవేక్షిస్తూ సాక్షులను కోర్టు హాజరుపరచడంలో సీఐ సయ్యద్ హాసం, ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్ కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ ఎ.నాగరాజు, మైదుకూరు కానిస్టేబుల్ బి.రాజశేఖర్ కృషి చేయగా అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించినట్లు పేర్కొన్నారు.


శిక్ష పడిన వారితో పోలీసులు

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

తాగునీటి వృథా అరికట్టండి

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దుంపలగట్టులో తాగునీరు వృథా అవుతోంది. గ్రామానికి తాగునీటిని సరఫరా మోటారుకు ఉన్న పైపు జాయింట్ సక్రమంగా లేకపోవడంతో నీరు లీకేజీ అవుతోంది. ఫలితంగా గ్రామంలో నాలుగు రోజులుగా కొన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. దీనిపై ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను పంపి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.


దుంపలగట్టు సమీపంలో మోటారు పైపు నుంచి వృథాగా పోతున్న నీరు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ముద్దనూరు(కొండాపురం), న్యూస్‌టుడే: పరిసరాలు శుభ్రతంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎంహెచ్‌వో నాగరాజు అన్నారు. శుక్రవారం ముద్దనూరులోని ఎస్టీ కాలనీ 1వ వార్డులో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకర వాతావరణం ఉంటుందన్నారు. జిల్లా అడిషినల్ మలేరియా అధికారి వెంకట్‌రెడ్డి, వైద్యులు శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ శోభాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

70 మంది ఎంపిక

పోరుమామిళ్ల : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగమేళాలో 70 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ఉద్యోగమేళా నిర్వహించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతకు ముఖాముఖీ నిర్వహించారు. 70 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కళాశాల అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9494294241
మైదుకూరు : 8555806848
బద్వేలు గ్రామీణ: 8008573493

?: ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ మల్లేలమ్మ గుడి నుంచి మైలవరం ఉత్తరకాలువలో అనుమతి లేకుండా షాపులు, షెడ్ల నిర్మాణాలు జరగడం వలన మురుగునీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది. వర్షాలు అధికంగా కురవడం వలన నీరంతా రోడ్లపైకి ప్రవహించడం వలన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. -చైతన్య, దంతవైద్యుడు, కల్వకట్టవాసి

✓: ఈ కాలువలపై ఉన్న నిర్మాణాలపై కోర్టులో దావా వేశారు. ఈ మేరకు కోర్టు నిర్ణయంతో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించడంతో ఆర్డీవో కూడా ఇరిగేషన్ అధికారులకు సర్వే చేయించాలని చెప్పారు. నివేదిక వచ్చిన అనంతరం చర్యలు చేపడతాం.

-రామకృష్ణ, గోపవరం పంచాయతీ కార్యదర్శి, పల్లాశ్రావణి, ఇరిగేషన్ మైలవరం ఎఈ

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం... రహదారులు అధ్వానం

అధ్వాన రహదారులతో అవస్థలు

-న్యూస్‌టుడే, మైదుకూరు

పురపాలక సంఘంలో విలీనమైన పంచాయతీ గ్రామాల్లో అభివృద్ధికి నోచుకోవడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ దుస్థితి ప్రధానంగా ఎల్లంపల్లె, ఎల్లంపల్లె బీసీకాలనీ, నానుబాలపల్లె పాతకాలనీ, కొత్తకాలనీ, యాదవకాలనీ కనిపిస్తోంది. గతంలో ఇవి ఎల్లంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీలు ఏళ్లు గడచిపోతున్నా ప్రజలకు వసతులు సమకూరలేదు. అటు పంచాయతీ అధికారులు పట్టించుకోక ఇటు పట్టణాధికారులు గుర్తించక ఇక్కడి ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. పరిష్కారంకాని సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎల్లంపల్లె నుంచి తిరుమలనాథ స్వామి ఆలయానికి వెళ్లే దారిని అభివృద్ధి చేయాలని ఎంతోకాలంగా కోరుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. నానుబాలపల్లె యాదవకాలనీ నుంచి ఎల్లంపల్లె బీసీకాలనీ వరకు పొలాల మీదుగా ఉన్న దారి అధ్వానంగా మారింది. వానొస్తే ఎల్లంపల్లె సమీప పొలాల్లోని నీరంతా దిగువగా ఉన్న ఎల్లంపల్లె బీసీకాలనీ వద్ద పెద్దఎత్తున చేరి తటాకాన్ని తలపిస్తోంది. పీర్లచావిడి, ఉర్దూ పాఠశాల వద్ద రహదారిపైనే స్థానికులు చెత్త వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. బీసీకాలనీలో రెండు ప్రధాన వీధులకు సిమెంట్‌రోడ్లు వేశారు. అడ్డ వీధులు అధ్వానంగా ఉన్నాయి. ముస్లిం శ్మశానవాటికకు దారిలేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నానుబాలపల్లె పాతకాలనీ, నానుబాలపల్లె కొత్తకాలనీల్లో వీధులు అభివృద్ధికి నోచుకోలేదు. వర్షమొస్తే రోజుల తరబడి నీరు నిల్వ ఉండి అపరిశుభ్రతకు కారణం అవుతోంది. అయిదేళ్ల కిందట చెట్టు విరిగి పడటంతో నీటితొట్టె పగిలిపోగా పునరుద్ధరణకు నోచుకోలేదు. వైకాపా పాలనలో గ్రామాలను పట్టించుకోక పోయినా తెదేపా హయాంలోనైనా అభివృద్ధి చేస్తారనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కాలనీల సమస్యలపై పురపాలక కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇంజినీరింగ్ అధికారితో కలిసి కాలనీలన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. అవసరమైన మేరకు ప్రాధాన్య క్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


నానుబాలపల్లె కొత్తకాలనీలో అధ్వానంగా వీధి


ఎల్లంపల్లె బీసీకాలనీ వద్ద చిన్నయ్యగారి పల్లె రహదారిపైకి చేరిన వర్షపు నీరు

సిమెంట్‌రోడ్లకు నోచుకోలేక పోతున్నాం



కాలనీ ఏర్పాటై 30ఏళ్లు అవుతోంది. కాలనీలోని వీధులు కొన్ని సిమెంట్‌రోడ్లకు నోచుకోలేదు. ఏడాదిన్నర కిందట రెండు ప్రధాన వీధులకు సిమెంట్‌రోడ్డు వేశారు. అడ్డ వీధులు అధ్వానంగా ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సిమెంట్‌రోడ్లు వేయాలి. కాలనీకి నీటి ట్యాంకు అవసరం ఉంది. **-జి.నాగసుబ్బారెడ్డి, ఎల్లంపల్లెకాలనీ**

వానొస్తే అడుగు పెట్టలేక పోతున్నాం



నానుబాలపల్లె పాతకాలనీ, కొత్తకాలనీలో కొన్ని వీధులకు సిమెంట్‌రోడ్లు వేసినా మిగిలిన వీధులు అధ్వానంగా ఉన్నాయి. వర్షమొస్తే మోకాటిలోతు నీళ్లు చేరుతున్నాయి. బయటకు వెళ్లే మార్గం లేదు. ఎండలొచ్చి ఎండిపోవాలే తప్ప ఏమీ చేయలేక పోతున్నాం. వీధుల్లో వర్షపునీరు నిల్వ చేరకుండా మెటల్‌రోడ్డు అయినా వేస్తే బాగుంటుంది. **-సోమిరెడ్డిపల్లె బాల ఓబన్న, నానుబాలపల్లె**

చౌక దుకాణ కాటాలకు ముద్ర తప్పనిసరి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ చౌక దుకాణాలకు సంబంధించిన నిత్యావసర సరకులు కొలతలు వేసే కాటాలకు తప్పనిసరి ముద్ర వేయించుకోవాలని, లేదంటే తనిఖీల్లో తూకం తక్కువ చూపే కాటాలు బయట పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జావేద్ పేర్కొన్నారు. శుక్రవారం వైఎంఆర్ కాలనీలోని సిబ్బందితో కలిసి ఆయన సర్కార్ రేషన్ దుకాణాలకు చెందిన కాటాలకు ముద్ర వేయు ప్రక్రియ చేపట్టారు. మండలంలోని 143 రేషన్ దుకాణాలకు గాను 73 వాటికి ముద్ర వేశామన్నారు. తక్కిన వారు ఇచ్చిన గడువు అక్టోబర్ ఒక్కటో తేదీ లోపు వచ్చి ముద్ర వేయించుకోకపోతే రూ.5 వేలు జరిమాన విధిస్తామని సూచించారు.


కాటాలకు ముద్ర వేస్తున్న తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జయదేవ్

తిరుమల ప్రసాదం అపవిత్రం చేశారని నిరసన

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సన్నిధిలో వేంకటేశ్వరుని మహాప్రసాదం అపవిత్రం చేశారని ఈ నిరసన ప్రదర్శన చేశారు. నామా ఎరుకలయ్య ఆశ్రమం నుంచి శివాలయం కూడలి వరకు ప్రదర్శన చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు మాట్లాడుతూ.. తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, కల్తీ నెయ్యివాడిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. నాయకులు నాగమునిరెడ్డి, చలపతి, మార్కండేయ, భాజపా నాయకులు నరేంద్ర, భాస్కర్‌రెడ్డి, హిందూ సంఘాలు, ఆర్యవైశ్యసభ ప్రతినిధులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నమూనాల ప్రదర్శనలో ప్రతిభ

మైదుకూరు, న్యూస్‌టుడే : వంట గదిలో దొరికే పదార్థాల ఉపయోగాలు, చుట్టూ ఉండే ఔషధ మొక్కలు వాటి ఉపయోగాలపై స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నమూనాల ప్రదర్శన పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిణి ప్రతినిధులు శుక్రవారం బహుమతులను అందజేశారు. సీనియర్ విభాగంలో డి.ఈశ్వర్, ఎన్.వంశీ, పి.భువనేశ్వర్‌రెడ్డి, జూనియర్ విభాగంలో ఎల్.కెవిన్, పీవీ చరణ్, ఎస్.మహ్మద్ అస్రాఫ్ బహుమతులు అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోశెట్టి రామ్మోహన్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మైదుకూరు : బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

వైకాపా నాయకులకు నోటీసులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: తిరుమలకు వెళ్లకుండా జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన తొమ్మిది మంది వైకాపా నాయకులకు పోలీసులు నోటీసు అందజేశారు. శుక్రవారం మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి వైకాపా నాయకులు అక్కడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోపాటు మరో తొమ్మిది మంది నాయకులకు నోటీసులు అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

కలసపాడు : మండలంలోని ఏడుగురి వైకాపా నాయకులకు శుక్రవారం నోటీసులు జారీ చేశామని ఎస్సై చిరంజీవి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వస్తున్న నేపథ్యంలో ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో నాయకులు అంకన గురివిరెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, బి.నారాయణ, షరీఫ్ తదితరులు ఉన్నారన్నారు.

కాలువలో పూడిక తొలగించాలి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక 44వ సచివాలయం పరిధిలో రైస్‌మిల్‌రోడ్డులో ఉన్న ప్రధాన కాలువలో ఉన్న పూడిక పనులను ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాలువ పూడిక తొలగించకపోవడం వలన వర్షం వచ్చినప్పుడు నీరు రోడ్లపైకి నిలుస్తోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కాలువలో పూర్తి స్థాయిలో పూడిక తొలగించాలని ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి పనులను పూర్తి చేయించడం జరుగుతోంది. ఎమ్మెల్యే వెంట 4వ డివిజన్ పారిశుద్ధ్య అధికారి నూర్‌బాషా ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

మంత్రి నారా లోకేశ్‌తో తెదేపా నాయకుడి భేటీ

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌తో ప్రొద్దుటూరు తెదేపా నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో శుక్రవారం కుటుంబ సభ్యులతో పాటు మంత్రిని కలిసి పలు విషయాలపై చర్చించారు. ప్రొద్దుటూరు పురపాలక పరిధిలో జరుగుతున్న కూల్చివేతలను ఆపాలని కోరినట్లు ప్రవీణ్ తెలిపారు. అలాగే ప్రొద్దుటూరులో ఇసుక అందుబాటులో లేక ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.


మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సబ్‌రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ

ముద్దనూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు, న్యూస్‌టుడే: కొత్తగా నియమితులైన సబ్ రిజిస్ట్రార్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముద్దనూరులో వెంకటరత్నమ్మ, మైదుకూరులో డీఎం బాషా ఈయన కమలాపురం నుంచి వచ్చారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జీఎన్‌జీ రామదాసు, బి.పార్వతి బాధ్యతలు తీసుకున్నా.


వెంకటరత్నమ్మ


పార్వతి, రామదాసు

ఆర్‌అండ్‌బీ డీఈఈగా విజయభాస్కర్‌రెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం: ప్రొద్దుటూరు ఆర్‌అండ్‌బీ డీఈఈగా విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. జాతీయరహదారుల ఈఈగా కొనసాగుతున్న ఈఈకి అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు.

సబ్ ఇంజినీర్‌గా వినోద్..

కలసపాడు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో శుక్రవారం సబ్ ఇంజినీర్‌గా వినోద్ బాధ్యతలు చేపట్టారు. ఈయన సింహాద్రిపురం నుంచి పదోన్నతిపై బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఏఈలు రమేష్‌బాబు, సుబ్రమణ్యం, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

దారిమళ్లిన వంక నీరు

మైదుకూరు పట్టణంలో కడ్డీల వంక నీరు దారి మళ్లింది. సర్వాయపల్లెరోడ్డులోకి చేరడంతో దారిమొత్తం నడవాల్సిన పలు గ్రామాల ప్రజలు నీటిలోనే రాకపోకలు తప్పలేదు. పట్టణంలోని అనేకుంట, చాపాడు మండలంలోని రేగి వంకల నుంచి వస్తున్న నీరు, పట్టణంలో మురుగుకాలువ నుంచి చేరుతున్న మురుగునీరు కడ్డీలవంకలో చేరుతున్నాయి. దీనికితోడు కేసీ కాలువ నుంచి వస్తున్న నీరు కడ్డీలవంకలోకి పెద్దఎత్తున చేరుతున్నాయి. కడ్డీలవంక కుచించుకు పోవడం, పూడిక చేరడంతో వంకలోకి చేరుతున్న నీరు ముందుకు సాగక దారి మళ్లడానికి కారణమైంది. ఈ విషయమై ఏఈ విశ్వకీర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వంకలో అడ్డుపడిన వ్యర్థాలను తొలగించి వంకలో సక్రమంగా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, మైదుకూరు**



రైఫిల్ షూటింగ్ జిల్లా జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జార్జి క్లబ్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికలకు జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ క్రీడా పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అండర్-17 బాలురు: ఎస్.మహమ్మద్ ఉజైర్(ప్రొద్దుటూరు), కె.అబ్దుల్ఖయూమ్(కడప), ఎస్.అక్రమ్ హుస్సేన్, పి.నాగరాజు (మైదుకూరు) ఎస్.భవ్యశ్రీ, వి.నిఖిల్ (పుల్లారెడ్డిపేట), బాలికలు: పిజా సుల్తానా, వి.మన్విత (ప్రొద్దుటూరు), సీహెచ్ వీరాంజి (కడప). అండర్-14 బాలురు: జైదర్ కిరణ్(కడప), నితిన్, ఎస్.ఎండీ.ఉజైర్ (ప్రొద్దుటూరు), బాలికలు: జాగృతి, జహ్నవి (ప్రొద్దుటూరు). వీరంతా రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ క్రీడా పోటీల్లో తలపడతారని ఆమె తెలిపారు. పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

యూరియా కొరత తీర్చాలి

మైదుకూరు, న్యూస్‌టుడే: యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్ డిమాండు చేశారు. శుక్రవారం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. క్రమేణ కొరత సృష్టించి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ నాయకులు చిలంగారి పుల్లయ్య, రామ్మోహన్, జగన్, కుర్ర సుబ్బరాయుడు, శీలిశెట్టి సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు ఆర్డీవోగా మైదుకూరు యువతి

మైదుకూరు, న్యూస్‌టుడే : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా మైదుకూరు పట్టణానికి చెందిన భూమిరెడ్డి పావని నియమితులయ్యారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1లో ప్రతిభ కనబరచి రెండో ర్యాంకు సాధించిన పావని ఏడాదిపాటు శిక్షణలో ఉన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


భూమిరెడ్డి పావని

యువతే దేశానికి పట్టుకొమ్మలు

బద్వేలు, గోపవరం: యువతే దేశానికి పట్టుకొమ్మలని హైదరాబాద్ సీబీఐ ఐపీఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. బద్వేలు బొజ్జిరెడ్డి కల్యాణ మండపంలో శుక్రవారం రాచపూడి నాగభూషణం విద్యాసంస్థలు, రామకృష్ణ సేవాసమితి సంయుక్తంగా నిర్వహించిన యువజన సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కడప చిన్మయ మిషన్‌కు చెందిన తురీయానంద, అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానంద, కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి అనుపమానంద మహరాజ్, రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల డైరెక్టర్ సుజన, పురపాలక వైస్‌ఛైర్మన్ వెంకటసాయికృష్ణ, ఎస్‌ఆర్‌ఎన్‌బీ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ ప్రసంగించారు.

విద్య, కళలను తపస్సులా అవపోషణ చేయాలి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: విద్య, కళలను తపస్సులా భావించి అవపోషణ చేయాలని డాక్టర్ నరాల రామారెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక జార్జిక్లబ్ ఆడిటోరియంలో మానస కళా సాంస్కృతిక సమాజం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు వంశీకృష్ణ, రవిప్రకాష్ అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పద్యపఠనం సీనియర్ విభాగంలో వై.దేవకుమారి (జడ్పీ ఉన్నతపాఠశాల, కొత్తపేట), బి.భార్గవ్ (పురపాలక ఉన్నత పాఠశాల, వసంతపేట), జి.లాస్యప్రియ (జడ్పీ ఉన్నత పాఠశాల, తాళ్లమాపురం). జూనియర్ విభాగంలో: పి.పఠాన్ ఆలియా (పురపాలక ఉన్నత పాఠశాల వసంతపేట), కె.షారో ఏంజెల్ (జడ్పీ ఉన్నత పాఠశాల, కల్లూరు), ఎం.షర్మిల (ప్రాథమికోన్నత పాఠశాల, ఈశ్వర్‌రెడ్డినగర్). క్లాసికల్ డ్యాన్స్ సీనియర్ విభాగంలో బి.వి.ఎల్. యశ్వస్విని (పురపాలక ఉన్నత పాఠశాల రామేశ్వరం పేట). జానపద నృత్యాలు సీనియర్ విభాగంలో... ఇంద్రజ గ్రూప్ (పురపాలక ఉన్నత పాఠశాల, 2వ వార్డు), టి.గంగమ్మ (జడ్పీ ఉన్నత పాఠశాల, తాళ్లమాపురం), కె.హారిక గ్రూప్ (పురపాలక ఉన్నత పాఠశాల, మోడంపల్లె). జూనియర్ విభాగంలో ఎ.జ్ఞానేశ్వరి (వైవీఎస్ పురపాలక బాలికోన్నత పాఠశాల, 10వ వార్డు), ఎం.లక్ష్మీలాస్య (పురపాలక ఉన్నత పాఠశాల, మోడంపల్లె), సి.హర్షిత (పురపాలక ఉన్నత పాఠశాల, 2వ వార్డు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నెగ్గారు. వీరు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందుకున్నారు. డిప్యూటీ డీఈవోలు కృష్ణప్ప, రాజగోపాల్, సంస్థ కార్యదర్శి కె.శీను, ఆర్థిక కార్యదర్శి శివరావు, ఉపాధ్యాయులు లలితకుమారి, కె.పామిటేటి పాల్గొన్నారు.


ముఖ్యఅతిథులు, పోటీల్లో నెగ్గిన విద్యార్థులు

రాష్ట్రస్థాయికి ఎంపిక

పోరుమామిళ్ల : పట్టణానికి చెందిన నలుగురు చిన్నారులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. కడప ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 17 విభాగంలో అబూబకర్, సాజిద్, అమర్నాథ్, చరణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

సదస్సు జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : అక్టోబరు ఒకటో తేదీన జరిగే భూ సమస్యల పరిష్కార వేదిక సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యులు వీరశేఖర్ కోరారు. పోరుమామిళ్లలో ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ భూ సమస్యలపై అర్జీలు తీసుకురావాలని తెలిపారు.

సనాతన ధర్మ రక్షణ బాధ్యత అందరిది

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా శుక్రవారం స్థానిక నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జన సైనికులతో కలిసి సంఘీభావ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మతంలో సనాతన ధర్మం ఉంటుందని దాన్ని పాటిస్తూ ఎవరికివారు కాపాడుకోవాలన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేయడం చాలా దారుణమన్నారు. నాయకులు వనం గురుకుమార్, పవన్ కుమార్, నరసింహ, సుబ్బు, హరినాథ్‌రెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావ దీక్ష చేపట్టిన జనసేన నాయకులు

శరన్నవ రాత్రి వేడుకల పుస్తకావిష్కరణ

బద్వేలు, న్యూస్‌టుడే: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వచ్చే నెల అక్టోబర్ 3 నుంచి 13వ తేదీవరకు శరన్నవ రాత్రి ఉత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.సుబ్బారావు పేర్కొన్నారు. బద్వేలు అమ్మవారిశాలలో శుక్రవారం దసరా వేడుకలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. నాయకులు చలమయ్య, నాగరాజు, పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని చింతలపల్లెలో శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుసగాని బాలచెన్నయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్సై చిరంజీవి తెలిపారు. అతని వద్ద నుంచి 1.100 కిలోల గంజాయి ఆకు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రామాయపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని శుక్రవారం అరెస్టు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. వీరి నుంచి రూ.48,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చిన్నారిని బలిగొన్న కాలువకు రక్షణ చర్యలేవి?

వంతెనకు ఏర్పాటు కాని రక్షణ గోడ

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

ప్రొద్దుటూరు మండల పరిధిలోని నరసింహాపురం బీసీ కాలనీలో ఉద్ధృతంగా ప్రవహించే వర్షపు నీటి కోసం పంట కాలువ మీదుగా వంతెనకు ఇరువైపుల కాంక్రీటు గోడలను (పారాబెట్స్) ఏర్పాటు చేయకపోవడంతో చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. భద్రత, రక్షణ చర్యలపై ముందుచూపు లేని పంచాయతీరాజ్ ఇంజినీర్లు, పాలకుల నిర్లక్ష్యం వలన సమస్య చాన్నాళ్ల నుంచి జఠిలంగా ఉంది. ఈ ఏడాది మార్చి 1న నరసింహాపురం బీసీ కాలనీకి చెందిన రెండేళ్ల వయస్సు చిన్నారి జస్విత తన అక్కతోపాటు సమీపంలోని అంగడిలో చాక్లెట్ కొనేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు లోతైన కాలువలోపడి మరణించింది. దీంతో బాధిత కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. ముక్కుపచ్చలారని చిన్నారి మృతిచెందడానికి కారణమైన పరిస్థితులు మళ్లీ పునరావృతంకాకుండా ఉండేందుకు రక్షణ చర్యలను చేపట్టకుండా పాలకులు, అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఏడు నెలల గడుస్తున్నా సమస్యాత్మక కాలువకు పారాబెట్స్ ఏర్పాటు పనులకు అతీగతీ లేకపోవడంతో ఎంత మంది పిల్లల ప్రాణాలుపోతేకానీ పట్టించుకోరా అని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజినీర్లు, పెద్దశెట్టిపల్లె-2 (గ్రామ సచివాలయ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు తీరుమారకపోతే భారీమూల్యం చెల్లించుకుంటారని హెచ్చరిస్తున్నారు. సమస్యపై పీఆర్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పంచాయతీ నిధులతో కాలువపై వంతెనకు ఇరువైపుల పారాబెట్స్‌లను నిర్మిస్తామని తెలిపారు.


నరసింహాపురం బీసీ కాలనీలోని వంతెనకు రక్షణ గోడ లేని పంట కాలువ



కడప

•కడప •పులివెందుల •కమలాపురం

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మ

వైవీయూ (కడప) : చదువుతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వైవీయూ పీజీ ప్రధానాచార్యులు ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వైవీయూలో 'ఉన్నత విద్య ప్రయోజనాలు, వ్యూహాలు సవాళ్లు, నైపుణ్యం-ఆధారిత పాఠ్యాంశాలు' అనే అంశంపై జాతీయ కార్యశాల నిర్వహించారు. అకడమిక్ డీన్ ఏజీ దాము మేనేజ్మెంట్ విభాగ డీన్ ఆచార్య వై.సుబ్బరాయుడు, లక్ష్మీ నరసింహ, అమరేశ్వరరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై అవగాహన

వేంపల్లె, న్యూస్టుడే : విద్యార్థులు పర్యాటక రంగంపై అవగాహన కలిగిఉండాలని వేంపల్లె అటవీరేంజ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇడుపులపాయ అటవీప్రాంతం, ఎకోపార్కు, నెమళ్ల సంరక్షణ కేంద్రంలో నేచర్ ఎడ్యుకేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య ఉన్నతపాఠశాల విద్యార్థులకు పర్యాటకరంగంపై అవగాహన కల్పించారు.



విద్యార్థులతో అటవీ అధికారి బాలసుబ్రహ్మణ్యం

కమిషనర్ బాధ్యతల స్వీకరణ




కమలాపురం, న్యూస్టుడే : కమలాపురం నగర పంచాయతీ కమిషనర్గా పరదాల జగన్నాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాముడు పులివెందులకు బదిలీపై వెళ్లారు. చిత్తూరు జిల్లా పురపాలిక కార్పొరేషన్లో శానిటరీ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న జగన్నాథ్ ఇక్కడికి వచ్చారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

వెల్లటూరు(పెండ్లిమర్రి), న్యూస్టుడే : వెల్లటూరు పంచాయతీ సర్పంచిగా టి.నాగార్జునరెడ్డి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి తెలిపారు. ఆ గ్రామ సర్పంచిగా ఉన్న కె.మస్తాన్ అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో ఉపసర్పంచిగా ఉన్న టి.నాగార్జునరెడ్డికి సర్పంచిగా పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచి తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయం ఏవోగా సురేంద్రనాథ్



పెండ్లిమర్రి, న్యూస్టుడే : పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయ ఏవోగా కె.సురేంద్రనాథ్ శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పులివెందుల ఎంపీడీవో కార్యాలయం నుంచి పెండ్లిమర్రికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



శశిభూషణ్రెడ్డిని సత్కరిస్తున్న తెదేపా మండల కన్వీనర్ రామమునిరెడ్డి, నేతలు

వేంపల్లె, న్యూస్టుడే: సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, జిల్లా భాజపా అధ్యక్షుడు శశిభూషణ్రెడ్డి పేర్కొన్నారు. డైరెక్టర్గా ఎంపికైన ఆయన తొలిసారి శుక్రవారం వేంపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డి, జనసేన నియోజకవర్గ బాధ్యుడు హరీష్, భాజపా జిల్లానేతలు గాలిహరిప్రసాద్, సుష్మ, సునీల్కుమార్ ఆయన్ను సత్కరించారు

వరద నీటిని తొలగించండి

అరవిందనగర్ (కడప), న్యూస్టుడే : కడప నగరం 48 డివిజన్ పరిధిలోని లోహియానగర్లో గత రెండు రోజులు కురిసిన భారీ వర్షానికి రోడ్లపై వరద నీరు నిలిచింది. దీంతో స్థానికులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. లోహియానగర్తో పాటు రామరాజుపల్లి, ఎస్కేఆర్ నగర్, ఎస్టీవీ కాలనీ, కృపా కాలనీ, బుడగజంగం కాలనీలను కూడా వరద నీరు చుట్టూ ముట్టడంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి వరద నీరు రోడ్లపై నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు.



లోహియానగర్లో రోడ్డుపై నిలిచిన వరద నీరు

మానవత విలువలతో సమాజ స్థాపన

సిద్దవటం, న్యూస్టుడే : బాల్య దశ నుంచే విద్యార్థులు మానవత, నైతిక విలువలు పెంపొందించుకుని భవిష్యత్తులో సమాజ శాంతి స్థాపనకు కృషి చేయాలని కేంద్ర నియంత్ర కమిటీ జిల్లా డైరెక్టర్లు రాటాల గోపి, రామాంజనేయులరెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సమాజం-నైతిక విలువలు అంశంపై పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరుడు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. మానవత సేవా సంస్థ ప్రతినిధులు సుబ్బరాయుడు, బొడిచెర్ల వెంకట సుబ్బరాయుడు, అవ్వారు సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్ఎం ఉమామహేశ్వరుడు

వరద బాధితులకు సాయం



విరాళాలను పాఠశాల కరస్పాండెంట్కు అందిస్తున్న విద్యార్థులు

పెండ్లిమర్రి, న్యూస్టుడే : పెండ్లిమర్రి మండలం వెల్లటూరులోని శ్రీసత్యసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం కలసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించగా రూ.56,000లు వచ్చినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. సేకరించిన విరాళం మొత్తాన్ని శుక్రవారం ఈనాడు రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

మారుతీనగర్ : అనంతపురంలో అక్టోబరు 5, 6, 7, 8 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్క్ షాప్ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, అరవిందు, దేవ, ఉదయ్ పాల్గొన్నారు.

విలువలకు మారుపేరు ఏచూరి

కడప, చిన్నచౌకు, న్యూస్టుడే : విలువలు-నిబద్ధతకు మార్గదర్శి సీతారాం ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, మాజీ రాజ్యసభ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి అన్నారు. కడప ప్రెస్క్లబ్లో శుక్రవారం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లౌకిక ప్రజాస్వామ్యం కోసం కృషి చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రమణయ్య, సుబ్బరాయుడు, జయవర్ధన్, నారాయణ, సంగటి మనోహర్, గుర్రప్ప, శివకుమార్, రామ్మోహన్, మనోహర్, సుబ్బమ్మ, దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు తదితరులున్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న గఫూర్, తులసిరెడ్డి

ట్రిపుల్ఐటీ విద్యార్థులు... క్రీడల్లో మెరికలు

రాష్ట్ర, జాతీయస్థాయి పవర్లిఫ్టింగ్ పోటీల్లో పతకాల పంట



అమలాపురంలో పవర్లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బరువెత్తుతున్న ట్రిపుల్ఐటీ విద్యార్థిని

వేంపల్లె, న్యూస్టుడే: గ్రామీణ ప్రాంతాల నుంచి ట్రిపుల్ఐటీ మెట్లెక్కిన విద్యార్థులు సాంకేతిక విద్యలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పవర్లిఫ్టింగ్ పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన వారు ట్రిపుల్ఐటీ ఫిజిక్స్ విభాగాపతి, పవర్లిఫ్టింగ్ శిక్షకుడు డా.బాలగోవింద్తివారీ, డైరెక్టర్ కుమారస్వామిగుప్త, ఏవో రవికుమార్ ప్రోత్సాహంతో సాధన చేసి బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకుంటున్నారు. రోజూ తరగతులు అయిపోయిన వెంటనే కళాశాలలో తివారీ ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్కెళ్లి పవర్లిఫ్టింగ్ క్రీడలో బరువులెత్తుతూ మెలకువలు నేర్చుకుంటున్నారు. ఈ నెల 14, 15వ తేదీల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి క్లాసిక్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో ట్రిపుల్ఐటీ విద్యార్థులు పాల్గొని 8 బంగారు, ఏడు వెండి పతకాలు సాధించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...



చిన్ననాటి నుంచి క్రీడల్లో రాణిస్తున్నా. తల్లిదండ్రులు కృష్ణమ్మ, లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో ముందుకెళుతున్నా. గతేడాది వైజాగ్, మంగళగిరి, విజయవాడలలో రాష్ట్రస్థాయి పవర్లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు, వెండి పతకాలు సాధించా. అలాగే ఈ ఏడాది సెప్టెంబర్లో అమలాపురంలో జరిగిన పోటీల్లో బంగారు పతకం దక్కించుకున్నా. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలన్నదే నా లక్ష్యం.

- సువర్ణ, సీఎస్ఈ మొదటి సంవత్సరం, ఆమడగూరు, శ్రీసత్యసాయిజిల్లా

ఛాంపియన్గా నిలవాలనేదే ధ్యేయం



మాది రైతు కుటుంబం. తల్లిదండ్రులు మల్లమ్మ, మంజునాథ్. వ్యవసాయపనులు చేసి జీవనం సాగిస్తున్నారు. నేను 2023లో వైజాగ్, ఈఏడాది ఏప్రిల్లో గుంటూరు జిల్లా తెనాలిలో, తాజాగా అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించా. ఎలాగైనా ప్రపంచ ఛాంపియన్గా నిలవాలన్నదే లక్ష్యం.

- రాకేష్, సీఎస్ఈ రెండో సంవత్సరం, తిమ్మాపురం, కంబదూరు, అనంతపురం జిల్లా

క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా



నాకు క్రీడలంటే మక్కువ. తల్లిదండ్రులు మహలక్ష్మి, మోహన్. నాన్న బేల్దారి పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రోజూ మెలకువలు నేర్చుకుంటున్నా. గతేడాది మేలో విజయవాడలో, తాజాగా అమలాపురంలో జరిగిన జరిగిన రాష్ట్రస్థాయి పవర్లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రెండు పతకాలు సాధించా. ఎలాగైనా క్రీడాకోటాకింద ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.

- సాయిహర్షిత, ఈసీఈ మొదటి సంవత్సరం, వెలగపాడు, నెల్లూరు జిల్లా

ఒలింపిక్స్కు వెళ్లాలన్నదే లక్ష్యం



నాకు ఆటలంటే ఎంతో ఇష్టం. నాన్న అకయ్య, అమ్మ అంకమ్మ రజకవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నేను గతేడాది మేలో తమిళనాడు రాష్ట్రం కుర్తాలంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని అయిదో స్థానంలో నిలిచా. అలాగే ఈ ఏడాది మేలో గుంటూరు జిల్లా మంగళగిరి, సెప్టెంబర్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించా. ఎలాగైనా ఒలింపిక్స్లో దేశం తరపున పాల్గొనాలన్నదే నా లక్ష్యం.

- మల్లెం కొండయ్య, ఎంఎంఈ రెండో సంవత్సరం, గిద్దలూరు, నెల్లూరుజిల్లా



పతకాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామిగుప్త, ఫిజిక్స్ హెచ్వోడీ బాలగోవింద్తివారీ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కడప క్రీడలు, న్యూస్టుడే : అన్నమయ్య జిల్లా కోడూరులో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో, కరాటే పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గాయత్రి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బీరం శ్రీధర్రెడ్డి, నాగ ధర్మేశ్వర రాజు, కేఆర్ఆర్ఎం విద్యార్థి సుహురుత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై శుక్రవారం పీడీ ఆంజనేయులు, శిక్షకులు కె.వెంకటేశ్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

వేంపల్లె : రాష్ట్ర స్థాయి హ్యాండ్బాల్ పోటీలకు వేంపల్లె తలిశెట్టి శేషమ్మ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు కావ్య, నందిని, సుమశ్రీ, మేఘనాగంగోత్రి, మేఘన, అండర్-17 విభాగంలో జయశ్రీ, పల్లవి, ఆయేషా, చంద్రిక, ధరణిలు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెలలో గుంటూరు జిల్లా తెనాలి, తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్బాల్ పోటీలలో పాల్గొననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, పీడీలు విజయభారతి, ప్రభావతి తెలిపారు.



ఎంపికైన కడప విద్యార్థులతో ఉపాధ్యాయులు



వేంపల్లె : ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం నారాయణమ్మ, పీడీలు

రాయలసీమలోనే న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

మారుతీనగర్, న్యూస్టుడే : సీమలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడపలో ఎంఎస్ఎంఈ సాంకేతిక కేంద్రాన్ని ప్రభుత్వం అమరావతికి తరలించడం దారుణమన్నారు. ఉక్కుపరిశ్రమ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని డిమాండు చేశారు. రాయలసీమకు అన్యాయం జరిగితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనకు డిమాండు

కడప క్రీడలు, న్యూస్టుడే : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పడిన మానసిక ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పిల్లా కుమారస్వామి, ఉపాధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో మతి స్తిమితం లేని వారు అనేక మంది ఉన్నారని, వారందరికీ వైద్యం అందించాలని పేర్కొన్నారు. రిమ్స్లో కొత్తగా ఏర్పడిన మానసిక వైద్యశాలలో కనీస మౌలిక వసతులు కల్పించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మానసిక రోగులను గుర్తించి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం మనోబంధు సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణంరాజు, డాక్టర్ శ్రీనివాసులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



చక్రాయపేట : బాధిత కుటుంబానికి నగదుతో పాటు నిత్యావసరాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



కడపలో సరకులు అందజేస్తున్న అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబట్టర్

చక్రాయపేట, న్యూస్టుడే: గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ఇటీవల జరిగిన ప్రమాదంలో చక్రాయపేటకు చెందిన డ్రైవర్ మహబూబ్షరీఫ్ మృతి చెందారు. దీంతో చక్రాయపేట మండల ఉపాధ్యాయులు వారి స్నేహితుల సాయంతో రూ.66 వేలు అతని పిల్లల పేరుతో తపాలా కార్యాలయంలో డిపాజిట్ చేశారు. విద్యావనరుల కార్యాలయంలో బాధిత కుటుంబానికి మండల విద్యాశాఖాధికారులు జాఫర్సాధిక్, రవికుమార్లు శుక్రవారం నిత్యావసరాలు అందించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివారెడ్డి, ఎరికలరెడ్డి, భాస్కర్రెడ్డి, దాదాపీర్, కుళాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారుతీనగర్ : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని సట్టి నరసింహులు ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సట్టి భారవి అన్నారు. ఈ మేరకు ఆయన తండ్రి జగన్మాత మారెమ్మ తల్లి ఆలయ ధర్మకర్త సట్టి నరసింహులు వర్ధంతి సందర్భంగా నగరంలోని క్యాన్సర్ బాధితుడి కుటుంబానికి ఆసరాగా నిత్యావసర సరకులు, రూ.8వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబట్టర్, లక్ష్మీపతి, వనజ, శ్రీనివాసులు, భాస్కర, మనీష్, వరప్రసాద్, బాలకృష్ణ, రాఘవేంద్రవర్మ, రమేష్ పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల నిర్వహణ

కడప విద్య, న్యూస్టుడే : ప్రతి విద్యార్థి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, విద్యార్థి స్థాయి నుంచి అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 నిర్వహిస్తోందని కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి అన్నారు. స్థానిక సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వ్యాస రచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు శనివారం కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు విశ్వనాథరెడ్డి, రామాంజనేయరెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛభారత్ స్ఫూర్తి?

కమలాపురం, న్యూస్టుడే : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛభారత్ స్ఫూర్తి కొరవడుతోంది. గ్రామాల్లోని ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించడం, వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు వారి కార్యాలయాల దగ్గర మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. దీంతో ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజల అవసరాలను తీర్చే మరుగుదొడ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కల మధ్య అసౌకర్యంగా అధ్వానంగా ఉంటున్నాయి. మండల కేంద్రంలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ఆరోగ్య సేవా కేంద్రాలు, విద్యాశాఖ, పశు వైద్యం, పీహెచ్సీ తదితర కార్యాలయాలున్నాయి. దాదాపు చాలా చోట్ల మరుగుదొడ్ల పరిస్థితి ఇలానే ఉంది. కొన్నింటికి నీటి సదుపాయం లేదు. ● వై.కొత్తపల్లెలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మధ్యలో పిచ్చి మొక్కలు ఉండటం, పాములు తిరుగుతుండటంతో పిల్లలు, ఉపాధ్యాయులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. చిన్నచెప్పలి, ఎల్లారెడ్డిపల్లెలోని రైతు సేవా కేంద్రాల పక్కన మరుగుదొడ్లు పిచ్చిమొక్కల మధ్యన ఉండడంతో అక్కడికి వెళ్లలేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చిన్నచెప్పలిలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు పెరగడంతో రైతులు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్స్టేషన్లో, పీఆర్ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లోపలి భాగంలో ఉంటున్నాయి. వివిధ పనులపై తహసీల్దార్, పీఆర్ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చేవారు వాటిని వినియోగించే పరిస్థితి లేదు. వీటి నిర్వహణపై దృష్టి సారించాలని, కార్యాలయాలు, విద్యాలయాల వద్ద నున్న పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛభారత్ స్ఫూర్తికి విఘాతం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ సచివాలయాలు, రైతుసేవాకేంద్రాలు, విద్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల ఆవరణాల్లోని పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు కార్యాలయాల వద్దనున్న మరుగుదొడ్ల పరిసరాలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



చిన్నచెప్పలిలోని రైతు సేవా కేంద్రం వద్ద ఇలా..

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

వైవీయూ (కడప), న్యూస్టుడే : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, కలుపు, పిచ్చి మొక్కలను వాలంటీర్లు తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్ వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శివరామకృష్ణ, డాక్టర్ లీలా వర్ధిని, అంకాల నాగరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పార్నపల్లె చెక్పోస్టు వద్ద భద్రత పెంపు

లింగాల, న్యూస్టుడే: పార్నపల్లె చెక్పోస్టు వద్ద కడప ఏఆర్, లింగాల పోలీసులతో భద్రతను పెంచారు. మంగళవారం అర్ధరాత్రి కొండాపురంలో దొంగలు పందుల చోరీకి విఫలయత్నం చేసి వాహనంలో అనంతపురం మీదుగా పారిపోయే ప్రయత్నంలో పార్నపల్లె చెక్పోస్టు వద్ద లింగాల పోలీసులు అడ్డుకోవడంతో దొంగలు వారిమీద రాళ్లతో దాడికి దిగి కోమన్నూతల వైపు పారిపోయారు. మళ్లీ ఇలాంటి ఘటనలు తలెత్తకుండా పగలు, రాత్రి బృందాల వారీగా ఒక హెడ్కానిస్టేబుల్, ఏఆర్ కానిస్టేబుల్, హోంగార్డుతో భద్రత ఏర్పాటు చేశారు.

ఉద్యోగ మేళాకు స్పందన

కమలాపురం : ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్మేళా నిర్వహించారు. ఇందులో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

వేముల : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా 32 మందిని ఎంపిక చేసుకున్నారని ప్రధానాచార్యులు సుగుణావతి వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రంలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నూర్జహాన్ పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో స్వయంగా హాజరు కావాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

కమలాపురం, న్యూస్టుడే: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు, శిరస్త్రాణం కలిగి ఉండాలని ఎస్ఐ ప్రతాప్రెడ్డి అన్నారు. ఆర్ఎస్రోడ్డుపై శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. దస్త్రాలు, శిరస్త్రాణం లేని వారికి జరిమానా విధించారు.

సాంకేతిక కేంద్రాన్ని తరలించొద్దు

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్టుడే: కొప్పర్తిలో ఏర్పాటు చేయాల్సిన ఎంఎస్ఎంఈ సాంకేతిక కేంద్రాన్ని అమరావతికి తరలించవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధురెడ్డి కోరారు. గత ప్రభుత్వం రూ.250 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. సంబంధిత కేంద్ర శాఖ అందుకు అంగీకరించిందని, దీన్ని రాష్ట్రం ప్రభుత్వం అమరావతికి తరలించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు బానిస అవ్వొద్దు

లింగాల, న్యూస్టుడే: మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎంపీడీవో లోకేశ్వరరావు పేర్కొన్నారు. స్నేహిత అమృత హస్తం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశమై ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తులో ఉన్నతంగా రాణించవచ్చన్నారు. ప్రిన్సిపల్ శ్రీరాములు, సంస్థ సభ్యులు రాజు, బాషా పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

వేముల, న్యూస్టుడే: అగ్నిప్రమాదాల నివారణలో అప్రమత్తత అవసరమని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి నాగరాజు పేర్కొన్నారు. ఏఈఆర్బీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లె యురేనియం పరిశ్రమలో శుక్రవారం సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. డీజీఎం సుమన్సర్కార్, అధికారులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లో ఘర్షణ

కడప, నేరవార్తలు : కడప నగరంలోని రాజా థియేటర్లో దేవర సినిమాకు కొంతమంది టిక్కెట్లు లేకుండా వెళ్లారు. దీంతో స్థలం లేక సగం మంది నిలబడి సినిమాను వీక్షించారు. అభిమానుల మధ్య గొడవ చోటు చేసుకుంది. టిక్కెట్లు లేకుండా వచ్చిన వారిని వెనక్కి పంపేందుకు యాజమాన్యం లోపలికి వెళ్లగా అభిమానులతోనూ గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లాఠీఛార్జీ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.